# నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి




సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం



కార్యక్రమానికి హాజరైన విద్యార్థినీ విద్యార్థులు

వన్‌టౌన్, డిసెంబర్ 17 (ప్రభన్యూస్)::విద్యారంగంలో నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టడం ద్వారా సమాజంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, విద్యార్థులు ప్రధానంగా భౌతిక శాస్త్రంలో నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం భౌతికశాస్త్ర ఆచార్యులు ఆచార్య ఎం. శివకుమార్ అన్నారు. పాత బస్తీలోని కెబియన్ కళాశాలలో ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం పీటీటీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జరిగే మినీ ఫిజిక్స్ ట్రైనింగ్ అండ్ టాలెంట్ సెర్చ్ ప్రోగ్రామ్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆచార్య ఎం. శివకుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశీయ విద్యావిధానంలో అనేక నూతన మార్పులకు శ్రీకారం చుట్టాయన్నారు. రోజు రోజుకూ అందుబాటులోకి వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానంతో బోధనా విధానంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ విధానం విద్యార్థులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ప్రధానంగా భౌతిక శాస్త్రంలో నిపుణులుగా తీర్చిదిద్దేందుకు ఇటువంటి మార్పులు దోహదపడతాయన్నారు. భౌతిక శాస్త్రంలో లోతైన అధ్యయనం కొనసాగించేందుకు అవసరమైన మౌళిక జ్ఞానాన్ని అందించటమే కాకుండా పరిశోధనల దిశగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈవిధమైన వర్క్‌షాప్‌లను తమ సంస్థ స్థానిక విద్యాసంస్థల సాయంతో నిర్వహిసున్నామని తెలిపారు. భౌతిక శాస్త్రంలో నూతన ఆవిష్కరణలకు, ఆలోచనలకు శ్రీకారం చుట్టి సమస్యలపై పరిష్కార మార్గాలు చూపెట్టాలన్నారు. అధ్యాపకులు నాణ్యతా ప్రమాణాలు పెంపొందించు కుంటూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు దోహదపడాలన్నారు. ఐసీఎఫ్ఏఐ విశ్వ విద్యాలయం భౌతికశాస్త్ర నిపుణులు డాక్టర్ టీ. శ్రీచరణ్ మాట్లాడుతూ విద్య అత్యంత శక్తివంతమైందన్నారు. ఎటు వంటి ఆటంకం లేకుండా నిరంతరం కొనసాగించినప్పుడే వ్యక్తి విజ్ఞాన వంతుడవుతాడన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులను బాలి కలకు ప్రాధాన్యతనిస్తూ ఈ వర్క్‌షాప్‌లో భాగస్వామ్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. అధ్యాపకులు తమ రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలపై పట్టు సాధించి విద్యార్థులను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ తమ కళాశాలలో భౌతిక శాస్త్రంలో భయాందోళనలను దూరం చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి కార్యక్రామలు రాష్ట్రంలోనే ప్రప్రథమంగా తమ కళాశాలలో నిర్వహిస్తుండటం హర్షనీయమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే. నవీన్ కుమార్, విభాగాధిపతి డాక్టర్ సంధ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.